క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రగతి స్కూల్, మధురానగర్, అపురూపాకాలనీ, బచపన్ స్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శుభాకాంక్షలు



ఏసీఎస్ఓ గంప శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీలర్ల సంఘం నాయకులు

చింతల్: బాలానగర్ సర్కిల్-1 సివిల్ సప్లై ఏసీఎస్ఓగా బాధ్యతలు చేపట్టిన గంప శ్రీనివాస్‌ను శుక్రవారం బాలానగర్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమర ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో డీలర్లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం సభ్యులు బీసు వెంకటేశంగౌడ్, మధుసూదన్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, భూషణ్, అజయ్, మధుగౌడ్ తదితరులు ఉన్నారు.

దోమల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-2లోని లిటిల్ స్కాలర్ హైస్కూల్‌లో శుక్రవారం ఎంటమాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమల వృద్ధి చెందవన్నారు. దోమల ఎలా వృద్ధి చెందుతాయన్న విషయాన్ని పిల్లలకు వివరించారు.

రేపు ప్రొ. జయశంకర్ విగ్రహావిష్కరణ

జగద్గిరిగుట్ట: ప్రొ. జయశంకర్ జయంతి సందర్భంగా ఈనెల 6న ఔట్‌పోస్ట్ సమీపంలో విగ్రహ ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

వెజిటేబుల్ డే



వెజిటుబుల్స్ వేషధారణలో విద్యార్థులు

కుత్బుల్లాపూర్: పద్మానగర్ ఫేజ్-2లోని టీవీఆర్ గీతాంజలి స్కూల్‌లో శుక్రవారం వెజిటేబుల్ డేను నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వెజిటేబుల్స్ వేషధారణలో ఆకట్టుకున్నారు. వెజిటేబుల్స్‌లో ఉండే పోషక విలువలు, వాటిని తీసుకుంటే కలిగే ఆరోగ్య విషయాలపై చిన్నారులకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ దేవి తెలిపారు.

గొయ్యి తీసి పత్తా లేకుండా పోయారు!

రంగారెడ్డినగర్: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రమాదకరంగా మారింది. రోజుల తరబడి అభివృద్ధి పనులను సాగదీయడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి బాపునగర్ రోడ్డు నం.4లో గోదావరి జలాల మ్యాన్‌వాల్వ్‌ను ఏర్పాటు చేసేందుకు వారం రోజుల క్రితం జలమండలి సిబ్బంది గొయ్యి తీసి ఆపై పత్తా లేకుండా పోయారు. దీంతో ఇళ్ల ముందు ఆడుకునే తమ చిన్నారులు గొయ్యిలో పడి ప్రమాదాల బారినపడతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతిలో వర్షపునీరు చేరి మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే మ్యాన్‌వాల్వ్ నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ కేంద్రాలు

- ప్రతి కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పరిశీలించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన ముందస్తు ప్రణాళికతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో మేడ్చల్,మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. శాసనసభ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, పోలింగ్ కేంద్రాల షిఫ్టింగ్, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, నూతన ఓటరు నమోదు, ఎన్నికల సందర్భంగా పొలిటికల్ పార్టీలు పాటించాల్సిన అంశాలపై ఆయన మాట్లాడారు. జిల్లాలో 1350 మించి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అదనపు ఓటర్ల కోసం కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల సౌలభ్యానికి కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను షిఫ్ట్ చేశామని పేర్కొన్నారు. అన్ని రకాల సౌకర్యాలు ఉన్న భవనాల్లోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నందున పోలింగ్ కేంద్రం(లొకేషన్) మారే అవకాశాలు ఉంటాయని, ఈ విషయంలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.అలాగే, పోలింగ్ కేంద్రాలు మారే వివరాలను కూడా సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల నాయకులకు తెలిపారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకులు సలహాలు, సూచనలు చేయగా, వాటిని పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించటానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తమ సహకారాన్ని అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, మల్కాజిగిరి, కీసర ఆర్డీవోలు శ్యామ్ ప్రకాశ్, రాజేశ్‌కుమార్, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

రైతుబీమా దరఖాస్తుకు నేడే చివరి తేదీ

నేటితో ముగియనున్న రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

దుండిగల్: నేటితో రైతు బీమా గడువు ముగుస్తుందని.. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు ఉన్న రైతులు, 2023 జూన్ 18లోపు వరకు ధరణి డేటా ప్రకారం కొత్తగా పాసుబుక్కులు పొంది ఉండాలన్నారు. అర్హులైన కొత్త రైతులు వెంటనే పాసుబుక్కులు, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లను అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు మండల వ్యవసాయ అధికారి 7288894684లో సంప్రదించాలని కోరారు.

2018 డిసెంబర్ తరువాత రుణం తీసుకున్న వారికి రుణమాఫీ వర్తించదు..

2018 డిసెంబర్ 11వ తేదీ వరకు బ్యాంక్‌లో అప్పు ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కుటుంబానికి రూ.లక్ష వరకే ఉంటుంది. భార్యాభర్తలకు ఎవరికైనా రూ.లక్ష వరకు పరిమితి ఉంటుందన్నారు. 2018 సంవత్సరం వరకు ఎంత అప్పు ఉంటుందో అంతే మాఫీ ఉంటుందన్నారు. 2018 తరువాత రెన్యూవల్ చేసుకున్న.. అప్పు మొత్తం చెల్లించి లోన్ క్లోజ్ చేసిన రైతులు అర్హులే. 2018 డిసెంబర్ తరువాత తీసుకున్న వారికి రుణమాఫీ వర్తించదన్నారు.

వచ్చిన 24గంటల్లోనే బదిలీ..

సుభాష్‌నగర్: బదిలీపై వచ్చిన తహసీల్దార్ 24 గంటలు గడవక ముందే మళ్లీ బదిలీ అయ్యారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లు బదిలీలు కావడంతో కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ సంజీవరావు సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి నుంచి పి. సైదులు కుత్బుల్లాపూర్ తహసిల్దార్‌గా వచ్చారు. గురువారం సాయంత్రం బాధ్యతలు తీసుకుని గంటపాటు మండలంలోని అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. అంతలోనే మరుసటి రోజు సైదులుకు మేడ్చల్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ)గా పదోన్నతి రావడంతో బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ తహసీల్దారుగా వినయ్ కుమార్ కొనసాగనున్నారు.

విద్యార్థి దశ నుంచే న్యాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి



టీవీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రమశిక్షణ కమిటీ

జీడిమెట్ల: పిల్లలు విద్యార్థి దశ నుంచే న్యాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు బీఎస్ రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం అపురూపాకాలనీలోని టీవీఆర్ పాఠశాలలో డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అధ్యక్షతన క్రమశిక్షణ మండలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామ్మోహనరావు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రమశిక్షణ, దృఢసంకల్పం, నిజాయితీ, అంకితభావం వంటి లక్షణాలు వికాసవంతమైన జీవితానికి పునాదులు వేస్తాయన్నారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ కమిటీలో ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ షైనింగ్‌టీం సభ్యులు అలీమ్, వెంకట్‌గిరి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యయులు లక్ష్మణ్, రజిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు విశేష స్పందన



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఓటరు కార్డ్ నమోదు, కార్డులో తప్పులు సరిచేసుకోవడం, అడ్రస్ మార్పు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అయితే ఇక్కడ కొందరు ఓటరుగా నమోదైతే.. మరికొందరు తప్పులను సరి చేయించుకున్నారు. ఓటరు నమోదు కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది.

ఇంపెక్స్ ఎగ్జిబిషన్‌లో 'వీఐపీ ఇంటర్నేషనల్' స్టాల్



హైదరాబాద్: హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇంపెక్స్ ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఎక్స్‌పో-2023 ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న ప్లాస్టిక్ ఎగ్జిబిషన్‌లో యువ పారిశ్రామికవేత్తలు మల్లెం భవ్యశ్రీ, గోపాలుని పునీత్ సాయి కనక వర్షలకు చెందిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. రెండేళ్ల క్రితం మల్లెం భవ్యశ్రీ జీడిమెట్లలో వీఐపీ ఇంటర్నేషనల్ అనే సంస్థను స్థాపించారు.

◆ ప్లాస్టిక్ ప్యాకింగ్ మెటీరియల్ తయారీ, మార్కెటింగ్ రంగంలో అనతికాలంలోనే మల్లెం భవ్యశ్రీ అగ్రశ్రేణి వ్యాపారవేత్తగా నిరూపించుకున్నారు. పలు రాష్ట్రాలకు ప్లాస్టిక్ మెటీరియల్‌ను అందిస్తూ వీఐపీ ఇంటర్నేషనల్ సంస్థ మార్కెట్‌ను దేశీయంగా బలోపేతం చేశారు. మల్టీఫిలమెంట్, పీపీ యార్న్, పీఈ వాక్స్, రా మెటీరియల్స్, కలర్ మాస్టర్ బ్యాచెస్ వంటి ఉత్పత్తుల తయారీలో వీఐపీ ఇంటర్నేషనల్ వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించుకున్నారు.

◆ మల్లెం భవ్యశ్రీ భర్త యువ పారిశ్రామికవేత్త గోపాలుని పునీత్ సాయి కనకవర్ష స్థాపించిన వెంకటేశ్వర పాలిమర్స్ ద్వారా హెచ్ఎం, ఎల్డీ కవర్స్, ష్రింక్ ఫిల్మింగ్స్, బయోడీగ్రేడబుల్ కవర్స్, స్ట్రెచ్ ఫిల్మ్ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఆరు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో ఈ ఉత్పత్తులను సరఫరా చేస్తూ తన వ్యాపార కార్యకలాపాలను వెంకటేశ్వర పాలిమర్స్ విస్తరించుకుంది.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామాల పఠనం



పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో లలితా సహస్రమానాల పఠనం చేస్తున్న మహిళలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్ సమీపంలో ఉన్న కట్ట మైసమ్మ ఆలయంలో శుక్రవారం లలితా సహస్రనామాల పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణంలో సహస్రమాలను పఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రోడ్డుపైకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి



కనుమాన్ కుంట నీరు రోడ్డుపై పారుతున్న విషయమై మాట్లాడుతున్న కార్పొరేటర్, అధికారులు

సుభాష్‌నగర్: గాజులరామం నుంచి మెక్కానిగూడకు వెళ్లే ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న కనుమాన్ కుంటను స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి, ఎస్ఈ చెన్నారెడ్డి శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షానికి కుంటలో అలుగు పారి ప్రధాన రోడ్డు మీదుగా నీరు రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. భారీ వర్షం కురిసినప్పుడు రోడ్డుపై నీరు రాకుండా దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. డీఈ రూపాదేవి, ఏఈ కళ్యాణ్, స్థానికులు గోపాల్ యాదవ్, మురళీకృష్ణ, పరుష శ్రీనివాస్, చారి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి



నిజాంపేట్: కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ సుపరిపాలన అందించే దిశగా కృషి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ ఆధ్వర్యంలో నందనవనం, శ్రీహోమ్స్ కాలనీల వాసులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. రోడ్లను బాగు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాస్‌మూర్తి, మోహన్, ఎంవీ రాజు, రాజశేఖర్, కిరణ్, విజయ్, శశి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో పరేషాన్..

కుత్బుల్లాపూర్: ప్రధాన రోడ్డును మురుగు ముంచెత్తడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీడిమెట్ల డివిజన్ పరిధి సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులోని ఆర్మ్‌స్ట్రాంగ్ అపార్ట్‌మెంట్ సమీపంలో శుక్రవారం డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగి రోడ్డుపైకి చేరింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, సమీప ఇళ్ల వాసులు దుర్గంధాన్ని భరించలేక తీవ్ర అవస్థలు పడ్డారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



బండి సంజయ్‌కు స్వాగతం పలికేందుకు తరలిన నేతలు



కూన శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణాలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన తొలిసారిగా నగరానికి విచ్చేసిన నేపథ్యంలో స్వాగతం పలికేందుకు గాజులరామారంలోని బీజేపీ కార్యాలయం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. సాధారణ కార్యకర్త నుంచి జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగిన నేతలు బీజేపీలో ఎంతోమంది ఉన్నారని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంలో లక్షలాది మంది పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లికి చెందిన సంగమ్మ అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. చికిత్స చేయించుకునేందుకు తగిన స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్సీని ఆశ్రయించింది. ఈ సందర్భంగా ఆయన సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించి రూ. 2.5 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. సదరు పత్రాన్ని శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

◆ ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్ ఆగం పాండు, తదితరులు పాల్గొన్నారు.

◆ అదే విధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఆదేశించారు.

డంపింగ్‌యార్డును తరలించడంలో నిర్లక్ష్యం



బాచుపల్లి డంపింగ్‌యార్డు వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: మూడేళ్లుగా నివాసిత ప్రాంతాల సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును తరలించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. శుక్రవారం బాచుపల్లి సర్వే నెంబరు 186లోని ఉన్న డంపింగ్ యార్డు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.

◆ ఈ సందర్భగా సతీష్ మాట్లాడుతూ... డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆగస్టు 15న లబ్ధిదారులకు అందిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారని అన్నారు. ఇళ్లకు సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డుతో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాచుపల్లి సర్వే నం.284, 285లలోని ప్రభుత్వ భూమిలోకి డంపింగ్ యార్డును తరలించేందుకు యత్నిస్తే గతంలో బీఆర్ఎస్ నాయకులే అడ్డుకున్నారని అన్నారు. దీంతో ప్రతినిత్యం కార్పొరేషన్ పరిధిలో సేకరిస్తున్న 160 టన్నులు చెత్త డంపింగ్ యార్డులో పేరుకుపోతోందన్నారు.

◆ ఇప్పటికైనా పేరుకుపోతున్న చెత్తకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా అధ్యక్షురాలు అమలేశ్వరి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాము, బీజేవైఎం అధ్యక్షుడు సాయి రెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అంకం సతీష్, స్వామి, మహిళా మోర్చా నాయకురాలు పావనీరెడ్డి, ఓబీసీ మోర్చా నాయకుడు లడ్డుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మాజీ వార్డు సభ్యురాలు గడ్డం పద్మావతి

సుభాష్‌నగర్: తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సంఘటన కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. బాలనగర్‌లో నివాసం ఉండే వినోద్, శారద దంపతుల కుమార్తె దూలపల్లిలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. ఆమె అనారోగ్యంగా ఉండటం వలన తల్లిదండ్రులు గురువారం సాయంత్రం 4గంటలకు హాస్పటల్‌లో చూపించేందుకు వచ్చారు. హాస్పటల్‌లో చూపిస్తున్న క్రమంలో వీరి రెండున్నర సంవత్సరాల బాలుడు చరణ్ తేజ్ ఆడుకుంటూ బయటకు వచ్చాడు. 18వ వార్డులో బాలుడు ఏడ్చుకుంటూ ఉండగా మాజీ వార్డు సభ్యురాలు గడ్డం పద్మావతి, ప్రసాద్‌లు చేరదీసి వివరాలు అడిగారు. బాలుడు సరిగా చెప్పకపోవడంతో వీరు గంట పాటు బాలుడి తల్లిదండ్రుల కోసం వెతకసాగరు. ఇదే క్రమంలో బాలుడు తల్లిదండ్రులు వెతుక్కుంటూ వీరికి తారసపడి బాలుడిని అప్పగించడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: జర్నలిస్టుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం మేడ్చల్ జిల్లా ప్రెసిడెంట్ బాలరాజు ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎమ్మెల్యేను కలిసి ఇళ్ల స్థలాలను కేటాయించడంతో పాటు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సాయిబాబా, జిల్లా నాయకులు దయాకర్ రెడ్డి, వెంకట్, రామస్వామి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు



గాజులరామారం విలేజ్ చౌరస్తాలో రోడ్డుపై వెలసిన డబ్బాలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సుభాష్‌నగర్: గాజులరామారం విలేజ్ చౌరస్తాలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ట్రాఫిక్ పోలీసులు సన్నాహాలు చేపట్టారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు జులై 31న చౌరస్తాను ఉన్నతాధికారులు ఆయా శాఖ అధికారులతో కలిసి ట్రాఫిక్ సిగ్నల్ సిగ్నల్ విషయమై పరిశీలించారు. అనంతరం మేడ్చల్ డీసీపీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు బాలనగర్ ఏసీపీ శ్రీనివాసులు, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డిల నేతృత్వంలో శుక్రవారం చౌరస్తాలోని ఫుట్‌పాత్‌లపై వెలసిన దుకాణాలను, డబ్బాలను తొలగించారు. ప్రస్తుతం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. త్వరలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో వాహనాల రాకపోకలు సాఫీగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.